ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులుగా సుజాత, జయంతి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పరిశ్రమల్లో ఎనిమిది గంటల పని దినాన్ని కూటమి ప్రభుత్వం 13 గంటలకు మార్చడాన్ని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి మండిపడ్డారు. దీనివల్ల మహిళలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఐద్వా నగర మహాసభ ఎం.జయంతి అధ్యక్షతన జరిగింది. నగర అధ్యక్షులుగా ఎస్.సుజాతమ్మ, కార్యదర్శిగా ఎం.జయంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా లత, బుజ్జమ్మలను, ఉపాధ్యక్షులుగా కోమలమ్మ, గురవమ్మలను ఎన్నుకున్నారు.

కుమ్మరి కండ్రిక చెరువులో ఓశ్విన్ వుడ్ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థ జలాలు

వ్యర్థనీరు శుద్ధిచేయకనే చెరువుల్లోకి

బేరియం పరిశ్రమతో ఘాటైన కంపు

'కాలుష్య' కోరల్లో 'పాగాలి'

నీటిని పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు రంగయ్య

ప్రజాశక్తి - ఏర్పేడు

గ్రామాల చెంతకు పరిశ్రమలు వస్తుంటే నిరుద్యోగం పోతుందని గ్రామస్తులు ఆశించారు. అయితే వలస కార్మికులతో పనులు చేయించుకుంటూ, 'లోకల్' చెరువుల్లోకి కాలుష్యం నీరు శుద్ధి చేయకనే వదలడంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది.. కిడ్నీలు దెబ్బతింటున్నాయని పాగాలి గ్రామస్తులు వాపోతున్నారు. పాగాలి సమీపంలో రాక్ మెన్(అల్లోయ్ వీల్స్ తయారీ), ఓశ్విన్ వుడ్ కంపెనీ (ప్లైవుడ్ పానల్స్ తయారీ), విష్ణు బేరియం ప్రైవేట్ లిమిటెడ్ (బేరియం మిశ్రమం తయారీ), తిరుమల స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (స్టీల్ రాడ్స్ తయారీ) వంటి పరిశ్రమలు వల్ల విడుదలయ్యే వ్యర్థపు నీరు వల్ల భూగర్భ జలాలు కలుషితమై నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఓశ్విన్ వుడ్ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థపు నీరు కిలోమీటర్ మేర పంట పొలాల నడుమ కాలువ ద్వారా ప్రవహించి పాగాలి పంచాయతీలోని కుమ్మరి కండ్రిగ చెరువులో కలుస్తోంది. దీంతో పంచాయతీ బోరు మోటార్ లోని నీరు రంగు, రుచి మారి గ్రామస్తులు తాగడం వలన రోగాల బారిన పడుతున్నారు. సాగునీరు కూడా కలుషితమవుతోంది. రాక్ మాన్ కర్మాగారం నుండి విడుదలయ్యే వ్యర్థపు నీరు పాగాలి చెరువు, ఏటి కాలువలోనికి కలిసిపోతోంది. దీంతో బోర్లలోని నీరు కలుషితం కావడంతో ఆ నీటిని తాగుతున్న పాగాలి గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు.

తాగు నీరు పూర్తిగా కలుషితం : సుమన్, పాగాలి

రాక్‌మాన్ పరిశ్రమ వ్యర్థపు నీరు మా గ్రామంలోని చెరువు, ఏటి కాలువలోకి వదిలేస్తున్నారు. దీంతో బోరు నీరు కలుషితమైంది. ఆ నీరు తాగడంతో మా గ్రామస్తులు విష జ్వరాలపాలై అల్లాడుతున్నారు. నా ఇద్దరు కుమార్తెలకు ఇటీవల కామెర్లు రావడంతో ట్రీట్మెంట్ చేయించాను. మా గ్రామంలోని మరికొందరికి కామెర్లు వచ్చింది. టైఫాయిడ్ తదితర వ్యాధులతో గ్రామస్తులం ఆందోళన చెందుతున్నాం. అధికారులు ఇటువైపు రాని పరిస్థితి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని నీరు కలుషితం కాకుండా చూడాలి.

ఉప్పు నీరు తాగలేకున్నాం : బి.మునెమ్మ, కుమ్మరికుంట

మా గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయి. ఉన్నది ఒకే పంచాయతీ బోరు మోటారు. అది కూడా ఓస్విన్ వుడ్ కంపెనీ నుండి వెలువడే వ్యర్థ జలాలతో కలుషితమై వాసన, ఉప్పుగా ఉండటంతో తాగలేకున్నాం. వర్షాకాలంలో అయితే ఎరుపు రంగుగా మారిపోవడంతో వడగట్టుకుని మరీ తాగాల్సిన పరిస్థితి. కొన్ని రోజుల క్రితం చెరువులోని కలుషితమైన నీటిని తాగిన మా గ్రామంలోని పశువులు చనిపోయాయి. ఉన్నది ఒక మోటర్ అది రిపేర్ అయితే పంట పొలాల్లోని బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితి. అవి కూడా ఏటి కాల్వకి దగ్గరగా ఉండడంతో రాక్ మాన్ వ్యర్థాల వల్ల కలుషితమైపోయాయి. తాగు, సాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకుని మా గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలి.

బేరియం పరిశ్రమతో ఘాటైన కంపు : వెంకట సుబ్బయ్య, కిడ్నీ బాధితుడు, కుమ్మరికండ్రిగ

ప్రతి దినం సాయంత్రమైతే పక్కనే ఉన్న బేరియం పరిశ్రమలో నుండి వచ్చే ఘాటైన కంపుతో అన్నం తినలేక, నిద్ర లేక వాంతులు చేసుకునే పరిస్థితి. ఓశ్విన్ వుడ్ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థ జలాలు మా చెరువులో కలుసుకోవడంతో చెరువును ఆనుకుని ఉన్న బోరు నీటిని తాగడం వలన నాకు రెండు కిడ్నీలు పోయాయి. ఇప్పుడు నిత్యం కిడ్నీ సమస్యతో బాధపడుతున్న. ఇటీవల మా గ్రామంలో ఓ యువకుడు అపెండిక్స్ ఆపరేషన్ చేయించుకున్నాడు. కలుషితమైన నీటిని తాగడం అనేక ఆరోగ్య సమస్యలతో ఎదుర్కొంటున్నాం.

కుమ్మరి గుంటలో ఇంటి గుమ్మం ముందు నిలుచున్న యువకుడు వెంకటేష్ అపెండెక్స్ తో ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి

రాంబాబు, సిఐటియు మండల కన్వీనర్

రాక్ మాన్, ఓస్విన్ వుడ్ ప్యానల్స్, విష్ణు బేరియం, తిరుమల స్టీల్స్ పరిశ్రమల నుండి వెలువడే వ్యర్థ జలాలు, వాయు కాలుష్యం వలన పాగాలి పంచాయతీలోని పాగాలి, కుమ్మరి కండ్రిగ సామాన్య ప్రజలు కలుషితమైన నీటిని తాగి కామెర్లు, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు పాలవుతున్నారు. మూగ జీవాలు చనిపోయే పరిస్థితి. కుమ్మరి కండ్రిగలో మౌలిక వసతులు కరువయ్యాయి. ఇక్కడ అధికంగా గిరిజనులు నివసిస్తున్నారు. కనీసం ప్రభుత్వ అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి. పరిశ్రమల వ్యర్థ జలాలు చెరువులు, కాలువలలోకి వదలకుండా అరికట్టాలి.

పంట పొలాల్లోనూ కాలుష్యం

స్విమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

దశాబ్దాలుగా స్విమ్స్ ఆసుపత్రిని నమ్ముకుని పనిచేస్తున్న కార్మికుల విషయంలో యాజమాన్యం అనుసరిస్తున్న తీవ్రమైన నిర్లక్ష్యం అభ్యంతరకరమైందని తక్షణం వారి సమస్యలను సానుకూల దక్పథంతో పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం స్విమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో కార్మికుల జనరల్ బాడీ సమావేశం జరిగింది సమావేశానికి సూరి అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ప్రసంగిస్తూ మూడు నెలల కింద ఆసుపత్రిలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారంపై కార్మికులు చేపట్టిన పోరాటం తదనంతర పరిణామాలను ఆయన గుర్తు చేశారు. స్విమ్స్ యాజమాన్యం, టీటీడీ అధికారులు, కలెక్టర్, ఎస్పీ, టీటీడీ ఈఓల విజ్ఞప్తి మేరకు.. కార్మికులు రోగులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు పోరాటాన్ని విరమించారని గుర్తు చేశారు. మూడు నెలల్లో సమస్యలు పరిష్కరిస్తామని, ఐఏఎస్ అధికారులతో ఏర్పాటు అయిన కమిటీ సూచనలు పాటిస్తామని అధికారులు చెప్పి గడువు తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అక్టోబర్ 5వ తేదీ నాటికి మూడు నెలల గడువు పూర్తవుతుందని ఈ లోపు స్విమ్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులందరినీ లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్ లోకి బదిలీ చేయడం, అందరికీ వేతనాలు పెంచడం పై నిర్ణయం చేయాలని తక్షణం కార్మికులకు శానిటేషన్ హోదాను మార్చి వార్డుబాయిగా పునరుద్ధరణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే యాజమాన్యం ఇచ్చిన హామీలు రెండేళ్లుగా అమలు కావడం లేదని తాజాగా మరొక మూడు నెలలు గడువు తీసుకొని సమస్యలు పరిష్కరించకపోతే తీవ్రత మరింత పెరుగుతుందని ఆయన హెచ్చరించారు. అక్టోబర్ 5వ తేదీ నాటికి స్పష్టమైన ప్రకటన వెలువడని పక్షంలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.ఈ జనరల్ బాడీ సమావేశంలో సిఐటియు నగర కార్యదర్శి మాధవ్, నాయకులు వేణుగోపాల్, బుజ్జి, స్విమ్స్ యూనియన్ నాయకులు రవి, సూరిబాబు, మారి ముత్తు, వేలు, గోపి, జయమ్మ, భాషా, జనార్ధన్, కోటయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ప్రకాశం పార్కులో సౌకర్యాలు పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగరంలో ప్రకాశం పార్క్ నడకదారిలో ఏర్పడుతున్న ఇబ్బందులు ఇతర సమస్యలపై సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు కాల్ యువర్ కమిషనర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయగా మున్సిపల్ ఇంజనీర్ రమణ పార్కులో పరిశీలించి సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా వందవాసి నాగరాజు, పార్కు అసోసియేషన్ కార్యదర్శి గోపి మాట్లాడుతూ పార్కులో చిన్న వర్షానికే నడకదారి కోతకు గురవుతోందని, బురద మయం అవుతోందని, గ్రావెల్ మట్టితో పూర్తి చేయాలని, వాకర్స్‌కు అనుకూలంగా మార్చాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, యోగా చేయడానికి ఒక హాల్ నిర్మించాలని, వాచ్ మెన్ ఏర్పాటు చేసి కుక్కలు లోపలికి రాకుండా ఇతర ఇబ్బందులు లేకుండా చేయాలని కోరారు. షటిల్ కోర్టు సిమెంట్ కాంక్రీట్ తొలగించి మెత్తగా ఉండేటట్లు చూడాలన్నారు. పరిశీలించిన డిప్యూటీ ఇంజనీర్ రమణ సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని తెలిపారు.

స్వర్ణముఖిపై బ్రిడ్జిల నిర్మాణానికి రూ.80 కోట్లివ్వండి : నాని

ప్రజాశక్తి - రామచంద్రాపురం

తిరుపతి జిల్లా, చంద్రగిరి నియోజకవర్గం లోని స్వర్ణముఖి నదిపై నాలుగు బ్రిడ్జిల నిర్మాణానికి రూ. 80 కోట్లు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) శుక్రవారం అమరావతిలో జరిగిన శాసనసభ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కష్ణంరాజును కోరారు. తిరుపతి రూరల్ మండల పరిధిలో స్వర్ణముఖి నదిపై చిగురువాడ, తనపల్లి, తిరుచానూరు, అప్పలాయగుంట ప్రాంతాలలోని బ్రిడ్జిలు 2021 వ సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలకు కూలిపోయాయని, దీంతో తాత్కాలిక రోడ్డుపై ప్రజలు, శ్రీవారి భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని సభలో మంత్రి దష్టికి తీసుకెళ్లారు. ఈ నాలుగు ప్రాంతాలలో స్వర్ణముఖి నదిపై బ్రిడ్జిలు నిర్మిస్తే వివిధ ప్రాంతాల నుండి తిరుమల, తిరుపతి, తిరుచానూరు దేవాలయాలకు దైవ దర్శనాల కోసం వచ్చే శ్రీవారి భక్తులకు, మూడు నియోజకవర్గాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని గుర్తు చేశారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి స్పందిస్తూ తిరుపతి పట్టణానికి అనుసంధానంగా ఉన్న ఈ నాలుగు బ్రిడ్జిలు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

స్థానికులకు పరిశ్రమల్లో 30 శాతం ఉపాధి కల్పించాలి : బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ప్రాంత పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు 30 శాతం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన అసెంబ్లీలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలపై చర్చించారు. శ్రీకాళహస్తి ప్రాంతంలో 45కు పైగా పరిశ్రమలో ఉండగా 70 శాతం మంది స్తానికేతరులే ఉపాధి అవకాశాలు పొందారని వివరించారు. వలస కార్మికులకు వేతనాలు తక్కువగా ఇవ్వచ్చన్న తలంపుతో పరిశ్రమల యాజమాన్యాలు ఇలా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ విధానాన్ని ఉటంకిస్తూ స్థానిక నిరుద్యోగ యువతకు మొదట ప్రాధాన్యత కల్పిస్తూ 30 శాతం ఉపాధి అవకాశాలు కల్పించేలా చట్టం చేయాలనీ, ఇది రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

శ్రీశక్తి చాముండేశ్వరి ఆలయంలో తుడా చైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తుమ్మలగుంట క్రాస్‌రోడ్డులోని శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. శుక్రవారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. డాలర్స్ దివాకర్ రెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారికి పసుపు కుంకుమ, పండ్లు పూలు,పట్టు వస్త్రాలతో సారెను సమర్పించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సందర్భంగా ఆలయం ధర్మకర్తలు తుడా చైర్మన్ దంపతులను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం తుడా చైర్మన్ దంపతులు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

'నరేగా' పనులు రీఓపెన్ చేస్తాం

'పల్లెపండుగ' నిధులు త్వరలో జమ

అడిషనల్ కమిషనర్ శివప్రసాద్

ప్రజాశక్తి - రామచంద్రాపురం

రాష్ట్రంలో టిడిపి హయాంలో 2017-19 మధ్యకాలంలో జిల్లాపరిషత్, ఎన్ఆర్ఈజిసి పథకాల నిధులతో నిర్మించిన సిసి రోడ్ల పనులను వైసిపి ప్రభుత్వం ఆన్లైన్లో క్లోజ్ చేసిందని, రద్దుచేసిన నరేగా పనుల జాబితాను జిల్లా స్థాయి అధికారులు గుర్తించి జాబితాను సిఆర్‌డికి పంపిస్తే ఆ పనులను రీ ఓపెన్ చేస్తామని ఏపీ గ్రామీణ అభివద్ధి శాఖ అడిషనల్ కమిషనర్ శివ ప్రసాద్ అన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం, కుప్పం బాదూరు పంచాయతీ ఒడ్డికాల్వ ఏఏ డబ్ల్యూ లో నూతనంగా నిర్మిస్తున్న మ్యాజిక్ డ్రైనేజ్ పనులను డ్వామా అధికారులు, నాలుగు జిల్లాల ఉపాధి సిబ్బందితో కలిసి పరిశీలించారు. మ్యాజిక్ డ్రైనేజ్ నిర్మాణంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017-2019 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన సీసీ రోడ్లను నిర్మాణం పూర్తి చేసి, యం బుక్ నమోదు చేసి ఉండి, ఆన్లైన్లో ఆ పనికి సంబంధించిన వర్కు రద్దయి ఉంటే ....అలాంటి పనులను జిల్లా కలెక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు గుర్తించి పనులకు సంబంధించిన పని సంఖ్య, పని పేర్లను, జాబితా తయారుచేసి గ్రామీణ అభివద్ధి శాఖకు పంపితే వెంటనే ఆన్లైన్లో సంబంధిత పనులను పునరుద్ధరించి గుత్తేదారుకు బిల్లులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 3.54 లక్షల పనులను కేంద్ర గ్రామీణ అభివద్ధి శాఖతో చర్చించి పునరుద్ధరించామని తెలిపారు. రాష్ట్రంలో ఉపాధి హామీ పనులు చేసిన కార్మికులకు రూ. 1750 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. రూ.350 కోట్లను అక్టోబర్ 2వ తేదీలోగా ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చేస్తామన్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన ఉపాధి హామీ పనులను చేపట్టాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పల్లె పండుగ పథకం ద్వారా నిర్మించిన సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, పశువుల తాగునీటి తొట్లెలు, భూగర్భ జలాల పెంపుదలకు నిర్మించిన సోంపిట్లు, త్వరలో బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాలలో మురికి నీటి కాల్వల్లో నిర్మాణం చేపట్టడం కన్నా.... మ్యాజిక్ డ్రైనేజ్ లను నిర్మించడం వల్ల భూగర్భ జలాల నీటిమట్టం పెరుగుతుంది, దోమల బెడద ఉండదు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఒడ్డికాల్వ గ్రామంలో నిర్మించిన మ్యాజిక్ డ్రైనేజ్ విధానాన్ని నెల్లూరు, కడప, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు సంబంధించిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, ఏపీడీలతో పరిశీలించి సంతప్తి వ్యక్తం చేసి, ఆర్ సి పురం ఉపాధి సిబ్బందిని అభినందించారు. అనంతరం శ్రీ శక్తిపీఠంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని శ్రీ మరకత శక్తి కాళీ దేవుని, వారాహి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు శ్రీనివాస్ ప్రసాద్ , క్లస్టర్ సహాయ పథక సంచాలకులు చిన్న రెడ్డప్ప, చిత్తూరు జిల్లా సహాయ పదక సంచాలకులు డాక్టర్ బి సుబ్రహ్మణ్యం, సునీలు కుమార్ పాల్గొన్నారు.

గడప గడపకూ జీఎస్టీ ప్రయోజనాలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'జీఎస్టీ -2.0 తగ్గింపు ఫలాలు' గడపగడపకూ తెలియజేసేలా ప్రణాళికతో నెలరోజుల పాటు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకూ సెలబ్రేషన్లు జరపాలని, విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డిఆర్ఒ నరసింహులు, ఎస్‌డిసి లీగల్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్మాండ్, జీఎస్టీ 2.0 జిల్లా నోడల్ అధికారి, అడిషనల్ కమిషనర్ నాగేంద్ర, డిప్యూటీ కమిషనర్ విజయలక్ష్మి, అసిస్టెంట్ కమిషనర్లతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు,ఎంపిడిఒలు, సచివాలయ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఈనెల 22 నుంచి చాలా వస్తువులపై జీఎస్టీ పన్ను 12శాతం నుంచి ఐదు శాతం వరకు, ఐదు నుంచి రెండు శాతానికి తగ్గించిందన్నారు. తగ్గిన రేట్ల ప్రకారం వస్తు సేవల ధరలు ఆరోగ్యం, విద్యా సేవలు రంగం, కిరాణా సామాగ్రి, పాలు, చపాతి, రోటీ, పన్నీరు, పాలు, వెన్న, తదితర ఉత్పత్తులు తగ్గినట్లుగా తెలిపారు. జిఎస్టి 2.0 వల్ల రాష్ట్రానికి 8 వేల కోట్ల రూపాయలు నష్టం వాటిల్లుతున్నప్పటికీ ప్రజలకు ఆమేరకు లబ్ది చేకూరుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిని స్వాగతించడం జరిగిందని అన్నారు .జిఎస్టి 2.0 ద్వారా ఏవిధంగా లబ్ది కలుగుతుందనే దానిపై ప్రజలకు విస్తతంగా తెలియజేసి వారిలో పూర్తి అవగాహన కల్పించేందుకు నెలరోజుల పాటు ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు.

బ్రహ్మోత్సవాల్లో పోలీసుల సూచనలు పాటించాలి : ఎస్పీ

ప్రజాశక్తి - తిరుమల

ఆదివారం జరిగే గరుడసేవ రోజు భక్తులందరూ క్రమశిక్షణతో, సహనంతో, పరస్పర సహకారంతో గరుడసేవలో పాల్గొనాలని ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. ఆదివారం గరుడసేవ విశేషంగా జరగనుంది. లక్షలాది మంది భక్తులు తిరుమలకు వచ్చే అవకాశం ఉంది. తిరుమల, తిరుపతిల ప్రత్యేక భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు చేశారు. భక్తులందరూ టిటిడి, పోలీసుల సూచనలు పాటిస్తూ శ్రీవారి దర్శనం చేసుకోవాలన్నారు.

గరుడసేవ రోజు భక్తులకు సూచనలు

- గరుడసేవ రోజు 4,223 మందితో పోలీసు బందోబస్తు, కట్టుదిట్టమైన ఏర్పాట్లు.
- టిటిడి, విజిలెన్స్ అధికారులతో సమన్వయం. వివిధ ప్రాంతాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు.
- చిన్నపిల్లలు, వయోవృద్ధులు, మతిస్థిమితం లేని వారికి డిజిటల్ జియో ట్యాగింగ్.
- నడకదారుల్లో ప్రత్యేక భద్రతా దళాలతో నిఘా
- ప్రత్యేక టెక్నాలజీ కలిగిన ఎఎన్‌పిఆర్ కెమెరాల ఏర్పాటు. ఈ కెమెరాలను కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. తిరుమలను ఆరు జోన్లుగా విభజించి ప్రతి జోన్‌కు ఒక డిఎస్‌పిని పెట్టి సిసి కెమెరాల ద్వారా రియల్ టైం మానిటరింగ్ చేసి తాజా పరిస్థితిని అప్డేట్ చేస్తుంటారు.
- సోషల్ మీడియా ప్లాట్ ఫార్ములలో ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సమయానుకూల సమాచారం ఇస్తారు. ఫేక్ సమాచారాన్ని నమ్మొద్దని సూచన. సామాజిక మాధ్యమాలలో అనుచిత పోస్టులు చేసే వారిపై నిరంతర నిఘా కోసం ఒక ప్రత్యేక బృందం డిఎస్‌పి స్థాయి అధికారి మానిటరింగ్ చేస్తారు.
- భక్తుల భద్రత దృష్ట్యా గరుడసేవ రోజు ఘాట్‌రోడ్డులో ద్విచక్రవాహనాలు నిలిపివేత.
- అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో గరుడసర్కిల్, అలిపిరి టోల్‌గేటు, పార్కింగ్ ప్రదేశాలను డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా.
- అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో 300 మందిపోలీసు సిబ్బంది రాష్ట్రం నుంచే కాక, ఇతర రాష్ట్రాల నుంచి పిలిపించాం. ఫేస్‌రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా, పాపిలోన్ డివైజెస్ ద్వారా అనుమానితులను తనిఖీ చేసి, నేరాల నివారణకు చర్యలు.

భక్తులకు మెరుగైన వైద్యసేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అవసరమైన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టామని టిటిడి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద తెలిపారు. తిరుమలలోని రాంబగీచా-2లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో అశ్విని ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్‌కుసుమకుమారితో కలిసి మీడియాతో మాట్లాడారు. టిటిడి ఈవో అనీల్‌కుమార్ సింఘాల్ ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అంతరాయం లేకుండా

వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 50 మంది డాక్టర్లు, 60 మంది పారా మెడికల్ సిబ్బంది భక్తులకు సేవలందిస్తున్నారని తెలిపారు. తిరుమలలో సాధారణ రోజుల్లో పది అంబులెన్స్‌లు అందుబాటులో ఉంటాయని, బ్రహ్మోత్సవాల్లో అదనంగా నాలుగు అంబులెన్స్‌లు అత్యవసర వైద్యం అందించేందుకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మాడావీధుల్లోని నాలుగు కార్నర్లలో ఒక్కో అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవ రోజు మాడవీధుల్లోని కార్నర్లలో 20 మంది సీనియర్ డాక్టర్లు, 20 మంది పారా మెడికల్ సిబ్బంది భక్తులకు వైద్యం అందిస్తారని తెలిపారు. రెండు బ్యాటరీ వాహనాల ద్వారా ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సీనియర్ సిటిజన్ల షెడ్డు వద్ద 12 పడకల ఐసియు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తిరుమలలో అందుబాటులో ఉన్న 12 డిస్పెన్సరీలతో పాటు బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వైద్యసేవలు అందించేందుకు అదనంగా ముఖ్యమైన ప్రాంతాల్లో పది డిస్పెన్సరీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాలిటెక్నిక్ హాస్టల్ మెస్సు బిల్లులు తగ్గించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాల ముందు ఆందోళన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్నారని, ప్రభుత్వ హాస్టల్ దగ్గరలో లేక ఎస్ఎంహెచ్‌లో ఉంటూ చదువుతున్నారని, వారి నుంచి నెలకు 3వేల రూపాయల మెస్సు బిల్లుల భారం వేస్తే వారు ఎక్కడనుంచి తెచ్చి కట్టగలరని అన్నారు. తక్షణమే హాస్టల్ మెస్సు బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టకుండా రోజూ 20-30 మంది ఉపవాసం ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. హాస్టల్లో వాష్‌రూమ్స్ శుభ్రంగా ఉండటం లేదన్నారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వీడాలన్నారు. మెనూ లేకుండా రోజూ సాంబార్ అన్నంతో సరిపెడుతున్నారన్నారు. కళాశాల గ్రౌండ్‌ను బయటి వ్యక్తులకు, కోచింగ్ అకాడమీ వారికి ఇవ్వడంతో కళాశాల విద్యార్థులు ఎక్కడ ఆడుకోవాలన్నారు. తక్షణమే లీజుకు ఇచ్చే ప్రక్రియను రద్దు చేసి విద్యార్థులు ఆడుకునేలా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీంద్ర, కళాశాల కమిటి అధ్యక్ష కార్యదర్శులు రేవంత్‌కుమార్, రంగస్వామి పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన..

రాయల చెరువు - అనుపల్లి

రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని రాయల చెరువు - అనుపల్లి రోడ్డు వర్షాలకు గుంతల మాయమై కుంటలు తలపించేలా ఉండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికి గురవుతున్న వాహన చోదకుల కష్టాలను గుర్తించి మంగళవారం ప్రజాశక్తి దినపత్రికలో ఇదేనా డబుల్ రోడ్డు అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించారు. ఆర్ అండ్ బి అధికారులతో మాట్లాడి వెంటనే రోడ్డుపై గుంతలు పూడ్పించాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి అధికారులు శుక్రవారం ఉదయం రాయలచెరువు - అనుపల్లి రోడ్డు మార్గంలో గుంతలకు కంకర బోసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. రోడ్లో వర్షపు నీరు నిలవకుండా డ్రైనేజ్ కాలువ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బీమా జీవితానికి ధీమా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఇన్సూరెన్స్(భీమా) మన కుటుంబానికి, ఆస్తికి, వ్యాపారానికి రక్షణ కవచం లాంటిదని ఎస్. రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరులో ఇన్సూరెన్స్ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పుత్తూరు ఎల్ఐసి కార్యాలయ అధికారి ఎస్,రామకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో ఇన్సూరెన్స్‌లో పొదుపు చేసిన డబ్బు ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధ్యక్షులు డాక్టర్ దేవకి, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో వడమాల పేట మండలం, శ్రీ బొమ్మరాజుపురం గ్రామపంచాయతీ గ్రామ ప్రధాన రహదారి ఇరువైపులా పిచ్చిగారి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వాహన చోదకులు రాత్రిళ్లు చాలా ఇబ్బందులు పడుతుండడం చూసి, ఆ గ్రామ సర్పంచ్ మణి రాజు స్పందించారు. ఈ సందర్భంగా శుక్రవారం పారిశుద్ధ్య కార్మికులు ఏసీబీ సాయంతో రోడ్డుకి ఇరువైపుల మొక్కలను తొలగించి గ్రామ రహదారిని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఆర్వో సతీష్, సెక్రెటరీ రితేష్ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు బాలకృష్ణ, నాగయ్య, వెంకటేష్, మణి పాల్గొన్నారు.

సబీనా షారన్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం పరిశోధన విద్యార్థిని సబీనా షారన్‌కు డాక్టరేట్ ప్రధానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె ప్రొఫెసర్ విజయలక్ష్మి మార్గదర్శకత్వంలో "అ స్టడీ ఆన్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ ఆఫ్ ఉమెన్ టీచర్స్ ఇన్ ది డిగ్రీ కాలేజెస్ ఆఫ్ బెంగళూ రు సిటీ ఇన్ కర్ణాటక" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమ ర్పించారు. ఈ సందర్భంగా సబీనా షారన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను అమలు చేసిందని టిడిపి నాయకులు బిల్లు చెంచురామయ్య తెలిపారు. గూడూరు పట్టణంలోని వ్యాపారులను టిడిపి నాయకులు కలిసి జీఎస్టీ తదితర వాటిపై కరప్రతాలు అందజేసి అవగాహన కల్పించారు. బిల్లు చెంచురామయ్య తదితరులు మాట్లాడుతూ సూపర్ సిక్స్, జీ.ఎస్టీ టు పాయింట్ జీరో ద్వారా వ్యాపారుల అమ్మకాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - చంద్రగిరి : చంద్రగిరిలో సుమారు గత పది సంవత్సరా లుగా వెంకటంపేట వద్ద కాస్త వర్షం పడితే చాలు, రోడ్డుపైనే వర్షపు నీరు నిలుస్తోంది. ఈ సమస్యతో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నోసార్లు అధికారులకు సమస్య ను తెలియజేసినప్పటికీ వారు పరిష్కార చర్యలు చేపట్టలేదని స్థానికులు తెలిపారు. ఇటీవల స్థానికులు ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా ఆయన స్పందించారు. మండల పరిషత్ అత్యవసర నిధుల రూ.8 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా నాలుగు మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయించారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

నిరుపయోగంగా నీటి శుద్ధి ప్లాంట్లు

ప్రజాశక్తి - రామచంద్రాపురం: గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు శుద్ధి తాగునీటిని అందించడమే లక్ష్యంగా గత వైసిపి ప్రభుత్వం 2021-2022 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులతో 22 ఆర్వో ప్లాంట్లను మంజూరు చేసింది. కానీ నిర్మాణాలను పూర్తి చేయకుండా సార్వత్రిక ఎన్నికల ముందు హడావుడిగా అప్పటి నాయకులు ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలో 22 ఆర్వో ప్లాంట్లు నిర్మించేందుకు పంచాయతీరాజ్ శాఖకు 8, ఆర్డబ్ల్యూఎస్ శాఖకు 14 కేటాయించారు. ఒక్కొక్క ప్లాంటు నిర్మాణానికి, యంత్రాల కొనుగోలుకు తుడా ఇంజనీరింగ్ అధికారులు రూ.6.80 వేల రూపాయలు మంజూరు చేశారు. కానీ తుడా అధికారులు ఆర్వో ప్లాంట్ల నిర్మాణాన్ని నామినేషన్ పద్ధతిలో వైసిపి నాయకులకు అంటగట్టారు. మండలంలోని అనుపల్లి, బీరమాలల కండ్రిగ, కుప్పం బాదూరు, నెత్తకుప్పం, సికె పల్లి, మోటవారి కండ్రిగ, పులమానియాపు కండ్రిగ, రావిళ్ళవారిపల్లి, దేశూరు కండ్రిగ, కునేపల్లి, నేనూరు, గ్రామాలలో ఆర్వో వాటర్ ప్లాంట్‌లు ఉత్సవ విగ్రహాలుగా దర్శనమిస్తూ నిరుపయోగంగా పడి ఉన్నాయి. రామాపురం, లోకోమతాపురం, నడవలూరు, బలిజపల్లి, పాత వేప కుప్పం, కొత్త వేప కుప్పం, గోకులాపురం, గంగిరెడ్డిపల్లి, వెల్లంపల్లిపురం, మిట్టూరు ఏ ఏ డబ్ల్యు, కే కే వి పురం గ్రామాలలో మాత్రమే ఆర్ఓ ప్లాంట్లో ప్రజలకు శుద్ధి నీటిని అందిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో ఆర్వో ప్లాంట్లు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా అందలేదు. మరికొన్ని ప్లాంట్లు ప్రారంభోత్సవానికి నోచుకోక మగ్గుతున్నాయి. ఇకనైనా అధికారులు, పాలకులు, స్పందించి ఆర్వో ప్లాంట్లను వినియోగంలోకి తీసుకొచ్చి మినరల్ వాటర్ అందజేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

స్వచ్ఛ భారత్ ఎక్కడ?

- చెత్త కుప్పలతో పాఠశాల పరిసరాలు
- దుర్వాసనతో విద్యార్థుల అవస్థ
- పారిశుద్ధ్యం లోపంపై ప్రజల ఆగ్రహం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రభుత్వాలు మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలు చేస్తుంటే వాటిని, మున్సిపాలిటీ అధికారులు తుంగలో తొక్కేస్తున్నారు. పుత్తూరు ప్రభుత్వ బాలికల పాఠశాల పరిసరాల్లో, షాపు వీధి, కార్వేటినగర్ రోడ్డు ప్రాంతాల్లో, జెండా మాను వీధిలో, జ్ఞాన జ్యోతి పాఠశాలకు వెళ్లే దారిలో చెత్త పేరుకుపోయి ఉండటంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. పాఠశాల వద్ద చెత్త కుప్పల నుండి వచ్చే దుర్వాసనతో విద్యార్థులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఉంది. చెత్త కుప్పలతో దోమలు చేరి విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసినా వారు కనీసం కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. విద్యార్థులు సురక్షితంగా, పరిశుభ్రంగా చదువుకునే వాతావరణాన్ని కల్పించాలని, స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

మున్సిపల్ శాఖ పన్నులు కట్టించుకుంటున్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం లేదు. వెంటనే నగరంలో పేరుకు పోయిన చెత్తను తొలగించి, వ్యాధుల బారినుండి విద్యార్థులను, ప్రజలను కాపాడాలి.

- మునిశేఖర్, జండా మాను వీధి

చెత్త తొలగించే వాహనాలు కొన్ని మరమ్మతుకు గురయ్యాయి. అందువల్ల కొన్నిచోట్ల చెత్తను సత్వరమే తొలగించలేకపోతున్నాం. త్వరలోనే వాహనాలకు మరమ్మతులు చేయించి, నగరంలోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తాం. చెత్త సమస్యను పరిష్కరిస్తాం.

- మంజునాథ గౌడ, మున్సిపల్ కమిషనర్

మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ వెలుగు కార్యాలయంలో శుక్రవారం మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి యన్. మోతి విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు సభ్యులు వివిధ రకాల వ్యాపారాలు చేయడానికి ముందుకు రావాలని అందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు శ్వేత మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండల సమాఖ్య నుండి గ్రామసంఘాలకు కమ్యూనిటి ఇన్వెస్ట్మెంట్ ఫండ్ ఋణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏపియం మునెయ్య మాట్లాడుతూ మన డబ్బులు మన లెక్కలు యాప్ ద్వారా సమాచారం తెలుసుకోవచ్చన్నారు. అనతరం సమాఖ్య సభ్యుల తీర్మానం మేరకు అధ్యక్షురాలుగా పి.శ్వేత, కార్యదర్శిగా భారతి, కోశాధికారిగా విద్య, ఉపాధ్యక్షురాలిగా లావణ్య, ఉపకార్యదర్శిగా అంకమ్మలను ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సిసి లు కె.వెంకటరత్నం, కె.జీవ, బి.వీరజిన్న, అకౌంటెంట్లు జి.హిమగిరిజ, ఎ.శిరీష పాల్గొన్నారు.

బిసి సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : భవన నిర్మాణ కార్మికులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తుందని, తక్షణమే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న రిటైర్మెంట్ ఉద్యోగుల భవనంలో శుక్రవారం బిసి డబ్ల్యూయు జిల్లా కార్యవర్గ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయాలు కార్పొరేట్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉన్నాయన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డి.పి. పోలయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను, శ్రామిక వర్గాన్ని మోసం చేస్తున్నారు. బిసి డబ్ల్యూయు రాష్ట్ర నాయకులు హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులసంక్షేమ బోర్డు నిర్వీర్యం చేసే సర్క్యులర్ 1214 ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెంట్రింగ్ యూనియన్ రాష్ట్ర షేక్ మిరావలి, పి ఓ డబ్ల్యుయు నాయకులు ఆసియా తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ సచివాలయంలో నూతనంగా ఆధార్ సెంటర్ ప్రారంభించారు. బియన్ కండ్రిగ మండల ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఎంపిడిఓ, డిప్యూటీ ఎంపిడిఓలు కోరారు.ఈ ఆధార్ కేంద్రం 15 రోజులు పాటు వివిధ రకాలైన ఆధార్ సేవలను అందిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవిబి పురం మండలం, అంజూరు గిరిజన కాలనీలో గురువారం రాత్రి దౌర్జన్యంగా బోనుపల్లికి చెందిన కొందరు దాడి చేసి గిరిజనులను గాయపరచడమే కాక బండ బూతులు తిట్టి, కత్తులు, కర్రలతో స్వైర విహారం చేస్తూ అడ్డొచ్చిన వాళ్ళని లేపేస్తామంటూ బీభత్సం సృష్టించిన యువకులను ఎస్టి అట్రాసిటీ కేసు, హత్యా యత్నం కేసు, గిరిజన స్త్రీలను బలాత్కారం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజనులతో కలిసి కేవీబి పురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన తర్వాత కూడా బోనుపల్లి యువకులు మళ్లీ గిరిజన కాలనీ మీద పడి దౌర్జన్యం చేశారని తెలిపారు . గిరిజనులకు మద్దతుగా సిపిఎం పార్టీ కెవిబిపురం ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు మాట్లాడుతూ బోనుపల్లి దళితులు నలుగురు దౌర్జన్యం చేస్తూ అంజూరు గిరిజన కాలనీలో అడ్డొచ్చిన మహిళలను పురుషులను బండబూతులు తిడుతూ కొట్టి గయపరిచారని కత్తుల తీసుకువచ్చి తిప్పుతూ వీధులలో వీరవిహారం చేశారన్నారు. భయభ్రాంతులకు గురైన యానాదులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. పోలీసు అధికారులు వారిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుని, గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజూరు గిరిజనులు పోలమ్మ, బాబు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఏఐటియుసి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్. చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణలు డిమాండ్ చేశారు. స్థానిక నారాయణాద్రి హాస్పిటల్ వద్ద, వరహాల గంగమ్మ తల్లి ఆటో స్టాండ్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు అనేక హామీలను ఇచ్చి గెలిచిన తర్వాత విస్మరించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ఈ ప్రభుత్వంపై కార్మికులు కన్నెర్ర చేస్తారని, గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ఎన్.శివ, పురుషోత్తం రెడ్డి, రవి, ప్రమీల, నాగభూషణం, బాలకృష్ణ, ఖాదర్ బాష, హరినాథ్ రెడ్డి, మురళి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు పథకాలతో సహకారమందిస్తాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పారిశుద్ధ్య కార్మికులకు అనేక పథకాలతో ఆర్థిక సహకారం అందిస్తామని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం స్వచ్ఛత హి సేవ కార్యక్రమం శుక్రవారం పాత మున్సిపల్ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎఫ్రాయిమ్, టిడిపి పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు అవకాశం

ప్రజాశక్తి - రామచంద్రపురం: అఖిల భారత సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ రాసి, గత కౌన్సెలింగ్ రౌండ్లలలో సీట్లు దక్కని విద్యార్థులకు ఇది ఒక శుభవార్త. సైనిక్ స్కూల్స్ సొసైటీ, రక్షణ మంత్రిత్వ శాఖ ఇప్పుడు తిరుపతిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌ను కూడా స్పాట్ రౌండ్ కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు ఎంపిక చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఇది మంచి అవకాశమని పాఠశాల చైర్మన్ డాక్టర్ శ్రీ.బి. శేషారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అసోసియేట్ డీన్‌గా రెడ్డి శేఖర్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎం.రెడ్డి శేఖర్‌ను నియమిస్తూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన శుక్రవారం ఉదయం కళాశాల అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ బోధన, పరిశోధనా రంగాలలో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

స్టోర్స్ కమిటీ చైర్మన్‌గా శివ ప్రసాద్

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయు క్యాంపస్‌లోని ఎస్వీయు కన్స్యూమర్స్ కోఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్ నిర్వహణ కోసం ముగ్గురు సభ్యుల నాన్-ఆఫీషియల్ పర్సన్-ఇన్-చార్జ్ కమిటీని నియమించింది. వ్యవసాయ, సహకారశాఖ ఆదేశాల ప్రకారం, ఈ కమిటీ ప్రస్తుత అధికారిక ఇన్-చార్జ్ స్థానంలో బాధ్యతలు స్వీకరించి, డిసెంబర్ 7 వరకు లేదా మరిన్ని ఆదేశాలు వెలువడే వరకు విధులు నిర్వహించనుంది. ఛైర్మన్‌గా కె. శివ ప్రసాద్, కమిటీ సభ్యులుగా నాగరాజు, విజయ సారధిలు ఎన్నికయ్యారు.

వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్దే లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా జీవనోపాదుల అధికారి ప్రమీల తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణం మాయాబజార్‌లోని, ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి 2.0 వర్షన్‌పై లోక కళ్యాణ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని వీధి వ్యాపారులకి ప్రభుత్వం రుణాలను విరివిగా మంజూరు చేస్తుందని తెలిపారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు, సునీత సేవా సంస్థ నిర్వాహకరాలు సారంగం సులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గౌరవప్రదమైన రాజకీయాలు చేయండి

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు, నేదురుమల్లి నివాసంలో వెంకటగిరి నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి మండల వైసిపి నాయకులతో శుక్రవారం భేటీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ గౌరవప్రదమైన అసెంబ్లీలో ఎమ్మెల్యే బాలకృష్ణ వైయస్ జగన్మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ దుర్భాషలాడటం బాధాకరమన్నారు. సంస్కారంలేని పదజాలాలను వినియోగిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను వైసిపి ఖండిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొడవలూరు దామోదర్ రెడ్డి, జడ్పిటిసి రైతు రామకృష్ణ, వాకాడు ఉపసర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సెంట్రల్ లైబ్రరీలో శుక్రవారం సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.యస్.ఆర్ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావులు విచ్చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సరస్వతి దేవి యొక్క కటాక్షం విశ్వవిద్యాలయం పైన ఉండాలని, ప్రతి విద్యార్థి కూడా ఆ సరస్వతి దేవి అనుగ్రహంతో చక్కటి విద్యాబుద్ధులు సంపాదించి, మంచి జ్ఞానాన్ని సంపాదించి, భారతీయ జ్ఞాన పరంపరకు మూలమైన సంస్కృతాన్ని, భారతీయ సంస్కృతిని సంరక్షించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం లైబ్రేరియన్ డా.ఎన్ వసంత్, వివిధ స్కూల్స్ డీన్స్ ప్రొ. సత్యనారాయణాచార్య, ప్రొ.విష్ణు భట్టాచార్యులు, ప్రొ.కృష్ణేశ్వర ఝా, ప్రొ.పి. వెంకట్రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి ట్రెక్కింగ్ యాత్ర

ప్రజాశక్తి - క్యాంపస్ : తెలుగు రాష్ట్రాల ఎన్‌సిసి డైరెక్టరేట్ ఆధ్వర్యంలో 25 నుండి అక్టోబర్ 2 వరకు తిరుపతి ఎన్‌సిసి గ్రూప్ ద్వారా అఖిల భారత ఎన్‌సిసి ట్రెక్కింగ్ యాత్ర 'ఏపి ట్రెక్-1', నిర్వహిస్తున్నారు. శుక్రవారం తిరుపతి ఎన్‌సిసి గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఎనిమిది రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు - ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, అండమాన్, పాండిచ్చేరి, కేరళ, లక్షద్వీప్, మహారాష్ట్ర, కర్ణాటక మరియు గోవా నుండి ఐదు ఎన్‌సిసి డైరెక్టరేట్ల నుండి మొత్తం 509 ఎన్‌సిసి క్యాడెట్లు, 15 అసోసియేట్ ఎన్‌సిసి అధికారులు ఈ ట్రెక్కింగ్ యాత్రలో పాల్గొంటున్నారు. ఈ యాత్ర అన్ని డైరెక్టరేట్ల నుండి క్యాడెట్లు పాల్గొనే సాంస్కృతిక కార్యక్రమంతో ముగుస్తుంది.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులు పెరిగిపోయాయి. దూరాన ఉన్న ప్రభుత్వ మద్యం షాపులకు వెళ్లకుండా తమ చెంతనే ఉన్న బెల్టు షాపులకు మందు బాబులు క్యూ కడుతున్నారు. డబ్బులెక్కువైనా లెక్కచేయడంలేదు. దీనికితోడు ఈ బెల్టు షాపుల్లో సమయంతో సంబంధం లేకుండా మందు ఎప్పుడూ అందుబాటులో ఉంటోంది. వీటిని అరికట్టాల్సిన ఎక్సయిజ్ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జయంపు, బాలాయపల్లి, మేల్చూరు, వెంకటరెడ్డిపల్లి గ్రామాల్లో వైన్ షాపులు ఉన్నాయి. అయినా సమీప గ్రామాల్లో బెల్టు షాపులున్నాయి. వీటిని షాపుల యజమానులే సిండికేటుగా ఏర్పాటై ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అధికారులు రాకుండా తామే చూసుకుంటామని నిర్వాహకులకు వీరు భరోసా కల్పిస్తున్నారని తెలిసింది. షాపు యజ మానులను బేఖాతరు చేసి బెల్టు షాపు నిర్వహిస్తే మాత్రం పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని స్థానికులు తెలిపారు. నిండలి, కడగుంట, మన్నూరు, అంబలపూడి, వెంకటరెడ్డి పల్లి, మన్నూరు, కాలగంద, పిగిలాం, పల్లి పాడు, మల్లెమాల, గాజులపల్లి, కాలగంద, నిడిగల్లు గొట్టికాడు, గొల్లగుంట హస్తకావేరి తదితర గ్రామాల్లో ఐదు ఆరు చొప్పున బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఒక్కో సీసీపై రూ.30 నుంచి రూ.50 వరకు ఆదనంగా వేసుకుని అమ్ముతున్నారని మద్యం ప్రియులు చెబుతున్నారు. బెల్టు షాపులను తొలగించాలని ప్రజలు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల సమావేశంలో కూడా ఎంపీపీ వీటి ఏర్పాటుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్టు దుకాణాలను ప్రోత్సహిస్తే వైన్ షాపులకు మొదట జరిమానా విధిస్తామని, మళ్లీ అదే బాట పడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు ఈ మండలంలో అమలుకావడంలేదు.

క్రైం న్యూస్

భవనం పైనుండి పడి కార్మికుడు మృతి

మృతి చెందిన రాజేంద్ర (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - చంద్రగిరి: మండల పరిధిలోని, నరిశింగాపురం, కెఎంఎం కళాశాలలో బిల్డింగ్‌లో వర్క్ చేస్తూ బిల్డింగ్‌పై నుంచి కింద పడి కార్మికుడు మృతి చెందిన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రగిరి మండలం ముగిలిపట్టుకు చెందిన రాజేంద్ర (47) కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. శుక్రవారం కూలి పనిలో భాగంగా కెఎంఎం కళాశాలకు వెళ్లాడు. బిల్డింగ్ పైన పని చేస్తూ ప్రమాదవశాత్తు కింద పడ్డారు. ఈ ఘటనలో రాజేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. కళాశాల యాజమాన్యం రాజేంద్ర మృతి చెందినప్పటికీ పట్టించుకోలేదని బంధువులు చంద్రగిరి పోలీసులను ఆశ్రయించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, మృతదేహాన్ని శవ పరీక్షల నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

కల్వర్టును ఢీకొట్టిన కారు.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: వేగంగా వెళుతున్న కారు పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారులో అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతికి చెందిన వాసు అనే వ్యక్తి పనుల మీద తిరుపతి నుంచి చిత్తూరుకు వెళుతున్నారు. కారు అతివేగంగా నడపడంతో, పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి, చంద్రగిరి మండలం బోడింబాయి సమీపంలో కారు వేగాన్ని అదుపు చేయలేక కల్వర్టును ఢీకొనింది. ఈ ఘటనలో వాసుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న చంద్రగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. గాయపడిన వ్యక్తిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగదు చోరీకి యత్నం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహిళ హుండీలో నగదు వేస్తుండగా ఓ వ్యక్తి అపహరించే యత్నం చేసిన సంఘటన శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో చోటు చేసుకుంది. సదరు మహిళ ఫిర్యాదు మేరకు ఆలయ సెక్యూరిటీ సిబ్బంది వ్యక్తిని అదుపులోకి తీసుకుని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. కౌన్సిలింగ్ ఇచ్చి ఆయన్ను అక్కడ నుంచి పంపేసినట్లు సీఐ గోపి తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - వాకాడు: మహిళల ఆర్థిక అభివృద్ధి మహిళా సమాఖ్య లక్ష్యమని తిరుపతి జిల్లా వాకాడు గ్రామీణ అభివృద్ధి సంస్థ (వెలుగు) ఏపీఎం పోలమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో జరిగిన మండల మహిళా సమైక్య సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు లాభాలు బాటలో నడిచేటట్టు వివో లీడర్లు శ్రద్ధ చూపాలన్నారు. స్త్రీ నిధి ద్వారా గేదల, కోళ్ల పెంపకానికి లోన్లు మంజూరు చేస్తున్నామన్నారు. బీమా రక్షణ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు, అకౌంటెంట్లు, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యువత కోసం నైపుణ్య శిక్షణ తరగతులు అవసరమని జ్ఞాన విద్యార్థి కోఆర్డినేటర్ డినాగరాజు పేర్కొన్నారు. శ్రీ అగస్త్య పిరమిడ్ ధ్యాన ఆశ్రమం తమిళనా డులో నిర్వహించబడిన యువత మేలు కొలుపు కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం ఆశ్రమం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధ్యాన విద్యార్థి ప్రాజెక్ట్ కో.ఆర్డినేర్ డి.నాగరాజు మాట్లాడుతూ బాబాజీ ఆశ్రమంలో యువత కోసం నైపుణ్యత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు.

భక్తులకు అన్నదానం, ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తమిళనాడు నుంచి తిరుమలకు నడిచివెళ్లే భక్తులకు తడుకు ఆర్ఎస్ వద్ద శుక్రవారం అన్నదానం, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బాలాజీ అన్నదాన ట్రస్ట్ అధ్వర్యంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందచేశారు. అలాగే తిరుపతి గంటా న్యూరో హాస్పెటల్ ఆధ్వర్యంలో న్యూరాలజిస్ట్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, మందులు అందజేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారుగా మూడు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. గత 19 సంవత్సరాలుగా శ్రీవారి బ్రహ్మోత్సవ రోజుల్లో గోవింద భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలలో ట్రస్టు సభ్యులు శ్రీధర్ రాజు, రాజేంద్ర రాజు, దామోదర్ రెడ్డి, రామచంద్ర రాజు, నాయకులు అమ్ములు, నారాయణబాబు, భాస్కర్ రెడ్డి,రామారావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గర్భిణీలు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తప్పనిసరిగా తినాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ గీతాంజలి తెలిపారు. వడమాలపేట మండలంలో శుక్రవారం స్వస్థనారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. పిహెచ్‌సీ పరిధిలో లక్ష్మమ్మ కండ్రిగ, బాలినాయుడు కండ్రిగ పంచాయతీల్లో ఫుడ్ స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ పోషక ఆహారం క్రమం తప్పకుండా శారీరక శ్రమ, ఒత్తిడి నిర్వహణ, తగినంత నిద్ర ఉన్న జీవన శైలి అలవరుచుకోవాలని తెలియజేశారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్ వైజర్ గీతాంజలి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ఇచ్చే బాలసంజీవని కిట్, పాలు, కోడిగుడ్లు, సమతుల ఆహారం తీసుకుంటూ రక్త హీనతను నివారించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి మెడికల్ సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయి ఏర్పడుతున్నట్లు తిరుపతి ఆపరేషన్ ఈఈ గంగాధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేదాంతపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఓటేరు, అవిలాల, ధనలక్ష్మి నగర్, వేదాంతపురం బయమ్మ తోట, ఎంఆర్ పల్లి సబ్ స్టేషన్ పరిధిలోని వాణి నగర్, చక్ర గార్డెన్, ఇంజనీర్స్ లేఅవుట్, సుబ్బయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీ, ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాకు ఏర్పడుతుందన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మను శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన వెంట మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తదితరులున్నారు.

శ్రీవారి గొడుగుల యాత్రికులకు అన్నదానం

ప్రజాశక్తి - పిచ్చాటూరు: శ్రీవారి గొడుగులతో పాదయాత్రగా తిరుమలకు వెళ్తున్న యాత్రికులకు అన్నదానం చేయడం తన మహద్భాగ్యంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీవారి గొడుగుల యాత్ర పిచ్చాటూరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎంకేటి కళ్యాణ మండపంలో యాత్రికులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు పద్దు రాజు, రవి రెడ్డి, వాసు రెడ్డి, దొరవేల్ రెడ్డి, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

హ్యాకథాన్ పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి, ఇన్స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 పోటీని శుక్రవారం నిర్వహించింది. తిరుపతిలోని ఎస్వీయు కంప్యూటర్ సైన్స్ విభాగం ప్రొఫెసర్ ఎమ్. హుమేరా ఖానం జడ్జి పోటీకి జ్యూరీ సభ్యురాలిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ప్రొఫెసర్ జి. రజిత, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ నాగరాజు, రామ జ్యోతి ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.